

టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు, కనిష్టం రూ.10 వేలు, సరాసరి రూ.18 వేల ధర పలికాయి.



అంజూర సాగుతో లాభాలు

పెద్దపప్పూరు మండలానికి చెందిన రైతు రమేష్‌నాయుడు అంజూర పంట సాగుతో లాభాలు గడిస్తున్నారు.

8లో



జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు 'పురం'లో జాబ్‌మేళా



హిందూపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'సీడాప్' సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 14 కంపెనీలు పాల్గొంటున్నాయని, దాదాపు 800 ఉద్యోగాలు భర్తీ చేస్తాయన్నారు. అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

'వెటర్నరీ పాలిటెక్నిక్'కు దరఖాస్తు చేసుకోండి

మడకశిర రూరల్: శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మడకశిర ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల డిప్లొమా కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 13 నుంచి 23వ తేదీలోపు www. svvu. edu. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

కేర్‌టేకర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: ఎల్డర్స్ కేర్ టేకర్ (వృద్ధుల సంరక్షణ) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన జిల్లాలోని మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఎంపిక చేసిన వారికి కేర్ టేకింగ్ అంశాలపై అవగాహన, సంపూర్ణ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి రాష్ట్రంలోని పలు నగరాల్లోనే కాకుండా హైదరాబాద్‌లోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9398643930, 9502803300 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రమాదం జరిగితే తెలిసేలా యాప్




మాట్లాడుతున్న ఏఎస్పీ విష్ణు

కొత్తచెరువు: రోడ్డు ప్రమాదాల వల్ల గాయపడిన వారి ప్రాణాలు కాపాడడంతో పాటు వెంటనే గుర్తించే విధంగా ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్‌యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఐఆర్‌ఏడీప్రాజెక్టు మేనేజర్ బీమ్లానాయక్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విష్ణు ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బీమ్లానాయక్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్‌యాప్ ద్వారా ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టవచ్చన్నారు.

గత ఏడాది మే నెలలో ధర్మవరం దగ్గర రోడ్డు ప్రమాదంలో 16 ఏళ్ల బాలుడు చనిపోయాడు. అతివేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ఇనుప దిమ్మెను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడటంతో బాధిత కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

రెండు వారాల క్రితం పెనుకొండ నుంచి సోమందేపల్లికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు అతివేగంగా వెళుతుంటే పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అందులో ఏ ఒక్కరికీ ఏళ్లు నిండలేదు. లైసెన్స్ లేకపోగా పూటుగా మద్యం సేవించారు.

బండి దొరికిందంటే చాలు రయ్.. రయ్ మంటూ దూసుకెళ్తున్నారు.. వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం లేకపోయినా హల్‌చల్ చేస్తున్నారు.. తరచూ పోలీసులకు పట్టుబడుతున్నా చాలా మంది మైనర్లు తమ పంథాను వీడటం లేదు. కొన్ని సందర్భాల్లో చేతులు, కాళ్లు విరగ్గొట్టుకోవడంతో పాటు మృత్యుపాలవుతుండటంతో తల్లిదండ్రులకు మాత్రం తీరని శోకాన్ని మిగులుస్తున్నారు.



మైనర్ల దూకుడు!

- వాహనాలతో మైనర్ల హల్‌చల్
- బైక్‌లను నియంత్రించే సామర్థ్యం లేకపోయినా రైడింగ్
- స్పెషల్ డ్రైవ్‌లో భారీగా పట్టుబడుతున్న వైనం
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం శూన్యం

సాక్షి, పుట్టపర్తి: పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్న ప్రేమతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇస్తున్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధన గురించి తెలియని మైనర్లు అతివేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ప్రాణాలు కూడా కోల్పోయిన దాఖలాలు ఉన్నాయి. వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం లేకున్నా రోడ్డెక్కి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. మైనర్ డ్రైవింగ్‌తో అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఇటీవల కాలంలో అధికం

కొంతకాలంగా మైనర్లు ఎక్కడ చూసినా రయ్.. రయ్ మంటూ దూసుకుపోతున్నారు. తగిన వయసు లేకుండానే వాహనాలను యమ స్పీడ్‌గా నడుపుతున్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను నడపటం నేర్పించడం వెంటనే వారే స్వయంగా నడిపేలా ప్రోత్సహించడం ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వారికి తెలియకుండానే మైనర్లు మోటారు సైకిల్ తీసుకెళ్లడంతో తరచూ ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమందికి గాయాలతో బయట పడుతుండగా.. మరికొందరు శాశ్వత వైకల్యంతో బాధ పడుతున్నారు. కొన్ని ఘటనల్లో మైనార్లు ప్రాణాలను కూడా కోల్పోతుండటంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటోంది.

చట్టం ఏం చెబుతోందంటే..

మోటారు వాహన చట్టం ప్రకారం 16 ఏళ్ల వయసు నిండిన వారు గేర్లు లేని సాధారణ వాహనం నడిపేందుకు అవకాశం ఉంది. అలాగే 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ అనుమతి పొందడానికి ఇతర వాహనాలు నడిపేందుకు చట్టం అంగీకరిస్తుంది. వయో అర్హత ఉన్న వారికి రవాణాశాఖ ఆధ్వర్యంలో తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఇలా జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినప్పటికీ మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడినా చట్టపరంగా శిక్షకు అర్హుడే. అదే సమయంలో వాహన యజమానిపైనా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది. నిబంధనలపై చైతన్యం, అవగాహన లేక ద్విచక్ర వాహనాలపై మైనర్లు రోడ్లపై చక్కర్లు కొడుతూ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడుతున్నారు.

వద్దని వారించే వారేరీ?

రహదారి నిబంధనలు కఠినంగానే ఉన్నా.. వాటి అమలు మాత్రం నీరుగారుతోంది. పిల్లలు వాహనాలు నడుపుతుంటే చూసి ముచ్చట పడే కుటుంబ సభ్యులు ఉన్నారే తప్ప వద్దని వారించే వారు చాలా తక్కువ. పాఠశాల స్థాయి విద్యార్థులు ద్విచక్ర వాహనాలను రద్దీ రోడ్లపై నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు.

అవగాహన కల్పిస్తున్నప్పటికీ..

పోలీసులు తరచూ వాహన తనిఖీలు చేస్తూ పట్టుబడిన వారికి అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనం నడపొద్దు.. ఎవరైనా పట్టుబడితే సంబంధిత యజమానిపై కేసులు నమోదు చేస్తామని.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటాలంటూ పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. వాహన యజమానులు, బాలల కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా.. పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడంలేదు.

గణాంకాలు ఇలా...

సంవత్సరం	కేసులు	జరిమానా మొత్తం
2021	102 కేసులు	రూ.51 వేలు
2022	257 కేసులు	రూ.1,28,500
2023 (మే 31 వరకు)	63 కేసులు	రూ.31,500

తల్లిదండ్రులదే బాధ్యత



నిబంధనల ప్రకారం 18 ఏళ్లు దాటిన వ్యక్తి కూడా డ్రైవింగ్ లైసెన్సు పొందకుండా వాహనం నడిపేందుకు వీలు లేదు. అలా నడిపితే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత. పిల్లలపై పెద్దలు నిరంతర నిఘా ఉంచాలి. తగిన వయసు వచ్చేంత వరకు పొరపాటున కూడా వారికి డ్రైవింగ్ నేర్పించకూడదు. చిన్నతనంలోనే ఖరీదైన వాహనాలు ఇప్పిస్తుండటంతో అధిక శాతం మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

హెచ్‌ఎంల బదిలీలు పూర్తి

- 41 మందికి పదోన్నతి
- 18 మందికి పాత స్థానాలే
- ఒక రోజు ముందే జాబితా



రాప్తాడురూరల్: ఎట్టకేలకు టీచర్ల బదిలీల్లో తొలి అంకం పూర్తయింది. షెడ్యూలు ప్రకారం శుక్రవారం తయారు కావాల్సిన ప్రధానోపాధ్యాయుల జాబితా ప్రక్రియ ఒకరోజు ముందుగా గురువారమే పూర్తయింది. జాబితాను ఉదయం ఆన్‌లైన్‌లో ఉంచి, వెంటనే పాతస్థానాల్లో రిలీవ్ అయి కొత్త స్థానాల్లో చేరిపోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీల జాబితా శుక్రవారం తెల్లవారుజామున లోపు విడుదల చేసే అవకాశం ఉంది.

18 మందికి పాతస్థానాలే

మొత్తం 267 మంది ప్రధానోపాధ్యాయులు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన 41 మంది ఆప్షన్లు ఇచ్చారు. మొత్తం 308 మంది ఆప్షన్లు ఇవ్వగా, 290 మంది ఆర్డర్లు జనరేట్ చేశారు. తక్కిన 18 మంది హెచ్‌ఎంలకు రిటైన్ (పాతస్థానాలు) చేశారు. బదిలీలు పొందిన వారిలో 8 మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు కాగా, 241 మంది ఇతర యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు.

నేడు మ్యూజిక్, క్రాఫ్ట్, ఒకేషనల్ టీచర్లకు కౌన్సెలింగ్

జిల్లాలో వివిధ స్కూళ్లలో పని చేస్తున్న మ్యూజిక్, క్రాఫ్ట్, ఒకేషనల్ టీచర్లకు శుక్రవారం ఆఫ్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ ఉంటుంది. ఉదయం 9 గంటలకు స్థానిక సైన్స్ సెంటర్‌కు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు.

మొన్న పంట నష్టం.. నేడు పరిహారం

- జిల్లాలో 716 మంది రైతులకు రూ.49.20 లక్షలు అందజేత
- సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంపై సర్వత్రా హర్షం



వడగండ్లకు నేల వాలిన వరి పంట

మార్చిలో పంట నష్టపోయిన రైతులు	716 మంది
వ్యవసాయశాఖ రైతులు	556 మంది
ఉద్యానశాఖ రైతులు	160 మంది
పంటనష్టపోయిన హెక్టార్లు	349.13
రైతులకు మంజూరైన మొత్తం	49.20 లక్షలు

పుట్టపర్తి అర్బన్: తామెప్పుడూ రైతు పక్షమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నోసార్లు ప్రకటించారు. ఇందులో భాగంగానే రైతాంగం కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు పక్కాగా అమలయ్యేలా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది మార్చి 16,17 తేదీల్లో అకాల వర్షాల దెబ్బకు జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున పంట నష్టపోయారు. మూడు నెలలు తిరగకనే వారికి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి భరోసా ఇచ్చారు.

349.13 హెక్టార్లలో పంటనష్టం

జిల్లాలోని 32 మండలాల్లో వరి, రాగి, టమాట, అరటి, బొప్పాయి, కళింగర, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇందులో వ్యవసాయశాఖకు సంబంధించి 556 మంది రైతులకు చెందిన 251.43 హెక్టార్లలో పంటలు నష్టపోయారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.31.22 లక్షలు మంజూరు చేసింది. అలాగే ఉద్యానశాఖ పరిధిలో 160 మంది రైతులకు చెందిన 97.70 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. వీటికి కూడా ప్రభుత్వం రూ.17.97 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసింది. రెండు కలిపి 716 మంది రైతులకు చెందిన 349.13 హెక్టార్లకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.49.20 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని జూన్ 1న రైతుల ఖాతాల్లో జమ చేసింది.

అంతా పారదర్శకంగానే..

పంటలు దెబ్బ తిన్నాయన్న సమాచారం రాగానే సచివాలయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది, వలెంటీర్లు వెళ్లి ప్రాథమిక అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. వీరికి రెవెన్యూ అధికారులు సైతం సహకారం అందించారు. జిల్లా అధికారులు అన్ని గ్రామాల నివేదికలను క్రోడీకరించి ఒక నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. వంద రోజులు తిరగకనే పంట నష్ట పరిహారం అందించి రైతన్నకు అండగా నిలిచారు.

టీడీపీ హయాంలో రైతులకు అన్యాయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంటలు సాగు చేసిన రైతులు బీమా చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకునేవారు. అయితే పంటనష్టం జరిగినా ఎప్పుడు బీమా డబ్బులు వస్తాయో తెలిసేది కాదు. అందులోనూ జన్మభూమి కమిటీలు, మండలస్థాయి నాయకులను దాటుకొని కాస్తో కూస్తో ఇచ్చేవారు. పంటలు ఎండిన ప్రతిసారి కరువు మండలాలు ప్రకటించడంతో చేతులు దులుపుకునే వాళ్లు. నాటి కష్టాలను కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్ ఉచిత పంటల బీమాను ప్రవేశపెట్టి ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లోనే పరిహారం ఇస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



రెండు ఎకరాల్లో సాగు చేసిన టమాట పంట నష్టపోయాను. పంట నష్టపోవడంతో వెంటనే ఆర్బీకే సిబ్బందికి తెలియజేయగా వచ్చి నష్టం వివరాలను నమోదు చేసుకెళ్లారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసాతో పాటు పరిహారం మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– శ్యామ్‌సుందర్‌రెడ్డి, తలమర్ల

ఎకరాకు రూ.15 వేలు



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా గాలీవానకు పంట అంతా నేల మట్టమైంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాతో పాటు పంట నష్టపరిహారం మంజూరు చేసింది. ఎకరాకు రూ.15 వేలు మంజూరైంది. ఇంత వేగంగా పంట నష్ట పరిహారం అందజేయడం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు.

– నారపరెడ్డి, మరకుంటపల్లి

కష్టం తెలిసిన నాయకుడు జగన్



రైతుల కష్టం బాగా తెలిసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్. ఆ కష్టం తెలియకుండా పంటలు ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్‌లోనే పరిహారం మంజూరు చేస్తూ రైతులకు అండగా ఉన్నారు. రబీ సీజన్‌లో సుమారు 556 మంది రైతులకు వ్యవసాయశాఖ ద్వారా రూ.32.22 లక్షలు మంజూరు చేశారు.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణ పరిరక్షణ

- కలెక్టర్ అరుణ్‌బాబు



ఈ స్కూటర్‌ను నడిపి పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో సంప్రదాయేతర ఇంధనశాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక పురోభివృద్ధిలో భాగంగా నూతన ఆవిష్కరణలతో ఎలక్ట్రిక్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వాయు కాలుష్య నివారణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. కాలుష్య కారకాల్లో వాహన కాలుష్యం ప్రధానమైందని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పేర్కొన్నట్లు తెలిపారు. విద్యుత్ ఆధారిత వాహనాలకు నాణ్యమైన విద్యుత్ కోసం చార్జింగ్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

17న ఆణిముత్యాలు కార్యక్రమం

జిల్లాలో ఈనెల 17న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల్లో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు వీసీకి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కానుక కిట్ల నాణ్యతను పరిశీలించాలన్నారు. స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు సకాలంలో చేర్చాలన్నారు. రాగిజావ, జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలు జరిగేలా చూడాలని సూచించారు. పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఆణిముత్యాలు పేరుతో ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నియోజకవర్గంలో ప్రతిభ కనబరిచిన వారికి 15న, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 17న జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలను అందజేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా బీపీ, షుగర్ రోగులకు నెలకు సరిపడా మందులు ఇవ్వాలన్నారు. ప్రసవ సమయానికి 10 రోజులు ముందే గర్భిణులను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' అందిన ఫిర్యాదుల్లో 70 శాతం పరిష్కరించారని, తక్కిన వాటికి నాణ్యమైన, అర్థవంతమైన పరిష్కారం చూపాలన్నారు.

రాగి పంట సాగును ప్రోత్సహించాలి



రాగి సాగుపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 25 వేల ఎకరాల్లో రాగి పంట సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కోర్టు చాంబర్‌లో వ్యవసాయ, సివిల్ సప్లయ్స్, ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులతో రాగి పంట విస్తీర్ణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ చేతన్ మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యానికి బదులు 3 కిలోల దాకా రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. పంపిణీకి అవసరమయ్యే రాగులను ఆయా జిల్లాల పరిధిలోని రైతుల నుంచి కనీస మద్దతు ధర క్వింటాలు రూ.3,578 ఉండగా రూ.268 పెంచి మొత్తం రూ.3,846తో కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలోని 32 మండలాల్లో ఉన్న కార్డుదారులకు ఆరు నెలలకు లక్ష క్వింటాళ్లు అవసరమవుతాయన్నారు. ప్రస్తుతం రైతులు 2100 హెక్టార్ల ద్వారా 30 వేల క్వింటాళ్లు మాత్రం పండిస్తున్నారని చెప్పారు. 20 వేల క్వింటాళ్లు అవసరాలకు ఉంచుకొని కేవలం 10 వేల క్వింటాళ్లు మాత్రం విక్రయిస్తున్నారన్నారు. తక్కిన 90 వేల క్వింటాళ్లు రాగులు పండించడానికి అదనంగా 7 వేల హెక్టార్లలో సాగు చేయించాల్సి ఉందన్నారు. వ్యవసాయశాఖ ద్వారా అధిక దిగుబడులు ఇచ్చే రాగి వంగడాలైన ఇంద్రావతి, వేగావతి, వీఎల్ 376, వీఎల్ 352 50 శాతం సబ్సిడీపై నాలుగు కిలోల ఉచిత మినీ కిట్లు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి రాగులను అమ్మదలిచిన రైతులకు గోనె సంచులు, లోడింగ్ ఖర్చు, రవాణ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రాగి పంట విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి రాగి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏపీ సీడ్స్ అధికారి ధనలక్ష్మి, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ అశ్వర్థ నారాయణనాయక్, జిల్లా కోఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్, ఏడీఏ కృష్ణమీనన్ తదితరులు ఉన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు

- కాంట్రాక్ట్, సీపీఎస్ ఉద్యోగుల్లో ఆనందం
- తమ జీవితాల్లో సీఎం జగన్ వెలుగు నింపారని సంబరాలు
- సీఎంకు అండగా ఉంటామని స్పష్టం

సాక్షినెట్‌వర్క్: కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు ఉద్యోగులకు జీపీఎస్ ద్వారా పెన్షన్ పథకాన్ని తిరిగి ప్రవేశపెడుతుండటంపై ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తుండటం సీఎం జగన్‌కే సాధ్యమైందని అంటున్నారు.

సీఎంకు అండగా ఉంటాం

కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలోని 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి దేశంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగుల పాలిటదేవుడిగా మారారన్నారు. జీపీఎస్ ఉద్యోగులకు మేలు చేస్తుంది.

– బత్తుల కోదండరామిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

చాలా సంతోషంగా ఉంది



సీఎం వైఎస్ జగన్ సీపీఎస్ రద్దు చేస్తూ జీపీఎస్‌ను అమలు చేయాలని నిర్ణయించడం హర్షణీయం. సీపీఎస్‌లో ఉద్యోగులు, ప్రభుత్వం జమ చేసే మొత్తాన్ని షేర్‌మార్కెట్‌లో పెడితే నష్టాలు వస్తే వాటి పర్యవసానాలను ఉద్యోగులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జీపీఎస్ విధానంలో రిటైర్ అయితే చివరి బేసిక్ పేలో 50 శాతం పెన్షన్ ఇస్తామనడం ఆనందకరం.

– ఇంద్రప్రసాద్, ఏపీవైఎస్సార్‌టీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

కలను నిజం చేశారు



మళ్లీ ఉద్యోగులకు పెన్షన్ వస్తుందని కలలో కూడా అనుకోలేదు. సీఎం జగన్ జీపీఎస్ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవటంపై మనస్ఫూర్తిగా జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా

– సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు, బుక్కపట్నం

మా జీవితాల్లో వెలుగు నింపారు



దేవుడు ఉన్నాడో లేదో తెలీదు కాని కనిపించే ప్రత్యక్ష దైవం మాత్రం సీఎం జగనే. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగిగానే పనిచేస్తున్నా. ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించి మా జీవితాల్లో వెలుగులు నింపారు.

– పుష్ప ఏఎన్‌ఎం, పుట్టపర్తి

మాట తప్పని నేత జగన్



"2004లో వైఎస్సార్ హయాంలో ఉద్యోగాలొచ్చాయి. నేడు ఆయన తనయుడు సీఎం జగన్ మా ఉద్యోగాలను పర్మినెంట్ చేశారు. సీఎం జగనన్నకు మేమంతా రుణపడి ఉంటాం. ఇచ్చిన మాట తప్పని నేతగా ఆయన చరిత్రకెక్కారు.

– ధనుంజయ్, హెల్త్ అసిస్టెంట్, పుట్టపర్తి

క్లుప్తంగా

దంపతుల దుర్మరణం


మృతుడు వెంకటశివారెడ్డి


జయమ్మ మృతదేహం

గోరంట్ల: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వృద్ధదంపతులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం మలసముద్రం గ్రామానికి చెందిన దంపతులు వెంకటశివారెడ్డి (65), జయమ్మ (62) గురువారం ఉదయం అమడగూరు మండలం కంచినగారిపల్లిలో బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. వేడుక ముగియగానే ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో గానివారిపల్లి సమీపంలోకి చేరుకోగానే గోరంట్ల నుంచి కదిరి వైపు వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన దంపతులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అంజూర సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- డ్రైఫ్రూట్స్‌గా మార్చి మూడు రాష్ట్రాలకు ఎగుమతి
- నాలుగు ఎకరాల్లో ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన రైతు రమేష్‌నాయుడు


అంజూర పండ్లను ఎండబెట్టిన దృశ్యం


అంజూర కాయలు

పెద్దపప్పూరు: వినూత్న ఆలోచనతో వివిధ రకాల పంటసాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని నిరూపించాడు ఉమ్మడి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలానికి చెందిన రైతు రమేష్‌నాయుడు. కష్టపడితే సాధించలేనిది ఏది లేదు అంటూ అందుబాటులో ఉన్న టెక్నాలజీ సాయంతో అధిక లాభాలను గడిస్తున్నాడు.

అరుదైన రకం.. అమెరికా నుంచి..

మార్కెట్‌లో అంజూర పండ్లకున్న డిమాండ్‌ను తెలుసుకున్న పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు రమేష్‌నాయుడు.. వెంటనే ఆ పంట సాగుపై దృష్టిసారించాడు. తన సోదరుడి సాయంతో అమెరికాలో సాగులో ఉన్న డయానా రకం అంజూర పంటపై ప్రత్యేకంగా అధ్యయనం చేశాడు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న అంజూర మొక్కల రకాల కంటే డయానా రకంలో మేలైన దిగుబడులు ఉండడంతో ఏడేళ్ల క్రితం అమెరికా నుంచి మొక్కలు దిగుమతి చేసుకున్నాడు. అనంతరం తనకున్న నాలుగు ఎకరాల్లో అంజూరా సాగు చేపట్టాడు.

తక్కువ పెట్టుబడి.. అధిక లాభం

అంజూర సాగు కోసం రైతు రమేష్‌నాయుడు తొలుత రూ.2 లక్షలను పెట్టుబడిగా పెట్టాడు. పంట కాపు చేతికి వచ్చిన తొలి ఏడాదిలోనే పెట్టుబడి మొత్తం చేతికి అందింది. ఆ తర్వాత మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను బట్టి ఏటా ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు ఆదాయాన్ని గడిస్తున్నాడు.

డ్రైఫ్రూట్స్‌గా మారిస్తేనే లాభం



పండిన పంటను అలాగే మార్కెట్‌కు తరలిస్తే కిలో రూ.60 నుంచి రూ.80 చొప్పున అమ్ముడు పోతోంది. అదే పంటను డ్రైఫ్రూట్స్‌గా మార్చి కిలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకూ విక్రయిస్తున్నా. దీంతో ఏటా రూ.15లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. సేంద్రీయ ఎరువులను వినియోగించడం వల్ల దిగుబడిలో నాణ్యత ఉంటోంది.

– రైతు రమేష్‌నాయుడు, ధర్మాపురం, పెద్దపప్పూరు మండలం

డ్రై ఫ్రూట్స్‌గా మార్చి... మరింత ఆదాయం


సరఫరా కోసం ప్యాకింగ్ చేసిన డ్రైఫ్రూట్స్

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అంజూర రూ.60 నుంచి రూ.80తో అమ్ముడు పోతోంది. అయితే పండు రూపంలో విక్రయించడం కంటే వాటిని ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్‌గా అమ్మకాలు చేపడితే మరింత లాభాలు ఉంటాయని తెలుసుకున్న రమేష్‌నాయుడు వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాడు. రూ. 2 లక్షలు వెచ్చించి పాలిథిన్ కవర్‌తో ఓ షెడ్డు ఏర్పాటు చేసి అందులో అంజూర పండ్లను డ్రైఫ్రూట్స్‌గా మార్చి కిలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఏపీలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకూ ఎగుమతి చేయడం మొదలు పెట్టాడు. అంతటితో ఆగకుండా అంజూర చెట్లకు అంటుకట్టి ఒక్కొక్క మొక్కను రూ.8 నుంచి రూ.10 చొప్పున రైతులకు విక్రయిస్తున్నాడు.

సిమెంట్ కుంభకోణంపై కొనసాగుతున్న విచారణ

మడకశిర: మడకశిర పంచాయతీరాజ్‌శాఖలో చోటు చేసుకున్న సిమెంట్ కుంభకోణంలో నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ చేపట్టారు. ఐదుగురు సభ్యులు గల విజిలెన్స్ బృందం గత కొన్ని రోజులుగా మడకశిరలోనే మకాం వేసి సిమెంట్ దుర్వినియోగంపై విచారణ కొనసాగిస్తోంది. 2019 నుంచి 2022 వరకు జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నియోజకవర్గంలోని 5 మండలాల్లోనూ విచారణ కొనసాగుతోంది. మొత్తం 800 పనులకు గాను ప్రభుత్వం 2లక్షల బస్తాలకు పైగా సిమెంట్ సరఫరా చేసినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తుండగా.. ఇందులో 90వేలకు పైగా బస్తాల సిమెంట్ పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. మరో 300 పనులను తనిఖీ చేయాల్సి ఉంది. ఈ లెక్కన సిమెంట్ దుర్వినియోగం మరింత పెరిగే అవకాశమున్నట్లు సమాచారం.

ధర్మవరం ఛైర్‌పర్సన్‌గా కాచర్ల లక్ష్మి


కాచర్ల లక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం అర్బన్: ధర్మవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేనేత వర్గానికి చెందిన కాచర్ల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సమక్షంలో చేపట్టిన నూతన ఛైర్మన్ ఎన్నికకు అధికారిగా (ప్రిసైడింగ్ ఆఫీసర్) ఆర్డీఓ తిప్పేనాయక్ వ్యవహరించారు. మొత్తం 40 మంది కౌన్సిలర్లకు గాను ఏడుగురు గైర్హాజరయ్యారు. 6వ వార్డు కౌన్సిలర్ కాచర్ల లక్ష్మిని ఛైర్ పర్సన్ అభ్యర్థిగా 15వ వార్డు కౌన్సిలర్ కుండా చౌడయ్య ప్రతిపాదించగా 11వ వార్డు కౌన్సిలర్ అత్తర్ జిలాన్‌బాషా బలపరిచాడు. కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్డీఓ తిప్పేనాయక్ అందజేసి, ఛైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందించారు. కౌన్సిలర్లందరినీ సమన్వయం చేసుకుంటూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మాజీ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల సేవలను కొనియాడారు. నూతన ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 8 గంటలకు శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ చేపట్టనున్న ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమెను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ఘనంగా సన్మానించారు.

సజావుగా ఎన్నికల ప్రక్రియ

- రాయదుర్గంలో కోరం లేక వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల స్థానాల్లో ప్రజాప్రతినిధుల ఎన్నిక ప్రక్రియ గురువారం సజావుగా సాగింది. ఎన్నికైన వారందరూ వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన వారే. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా ప్రాంత పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి ఎంపీపీగా బగ్గిరి త్రివేణ ని ఎన్నుకున్నారు. ఆమె అప్పరాచెరువు ఎంపీటీసీ సభ్యురాలిగా గతంలో గెలుపొందారు.

- విడపనకల్లు మండల ఉపాధ్యక్షురాలు-2గా రాకెట్ల పుష్పావతి ఎన్నికయ్యారు. ఆమె హాంచనహాళ్ ఎంపీటీసీగా గతంలో విజయం సాధించారు.
- చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ-1గా పి.రాములమ్మను ఎన్నుకున్నారు. ఆమె చెన్నేకొత్తపల్లి-2 ఎంపీటీసీగా గెలుపొంది ఉన్నారు.
- తనకల్లు మండల కో-ఆప్షన్‌గా కె.రహంతుల్లాను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికైన పైన పేర్కొన్న వారందరికీ ఆయా మండల ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.
- రాయదుర్గంలో కోరం లేక వైస్ ఎంపీపీ ఎన్నికను ఎన్నికల అధికారి వాయిదా వేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల కళ్లు గప్పి గంజాయి స్మగ్లర్ పరారైన అంశానికి సంబంధించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్ మోహన్ ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసుకున్నారు. ఉన్నతాధికారి ఆదేశాలతో 2వ తేదీ సెంట్రీ డ్యూటీకి హాజరయ్యాడు. అప్పటికే పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకుడు ఉన్నాడు. రాత్రి 1 గంటకు నిందితుడిని ఓ కంట కనిపెట్టాలంటూ కానిస్టేబుల్ శ్యామ్‌కు అప్పగించి సెట్ తీసుకుని ఓ గదిలోకి వెళ్లి అరగంట తర్వాత తిరిగి వచ్చాడు. ఈ లోపు అందుబాటులో ఉన్న సబ్బు ముక్కను నీటిలో తడిపి చేతులకు పూసుకుని బేడీలను తొలగించుకున్న నిందితుడు స్టేషన్ నుంచి బయటపడ్డాడు. ఆ సమయంలో అలికిడి కావడంతో అప్రమత్తమైన శ్యామ్ వెంటనే నిందితుడిని నిలువరిచేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. కాసేపటికి అక్కడకు చేరుకున్న గస్తీ జీపులోని సిబ్బందితో కలసి నిందితుడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, నిందితుడు తప్పించుకుని పోయేందుకు కారణమయ్యారంటూ కానిస్టేబుళ్లు మోహన్, శ్యామ్‌ని సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేశారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

కళ్యాణదుర్గం: మండలంలోని తిమ్మసముద్రం సమీపంలో ఉన్న ఏపీఐఐసీ భూములను గురువారం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వరప్రసాద్, తహసీల్దార్ ఫణికుమార్, సర్పంచు శ్రీనివాసులు పరిశీలించారు. మొత్తం 1,097 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

చేతిని కోల్పోయిన ప్రయాణికురాలు


రోడ్డుపై తెగిపడిన సుధ కుడి చేయి

పెద్దవడుగూరు: డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రయాణికురాలు తన కుడిచేతిని కోల్పోయింది. వివరాలు.. గురువారం ఉదయం గుత్తి నుంచి తాడిపత్రికి బయలుదేరిన కర్ణాటక ఆర్టీసీ బస్సులో కర్ణాటకలోని కార్వార్ జిల్లా యల్లాపూర్‌కు చెందిన సుధ ప్రయాణిస్తోంది. బస్సు వెనుక సీటులో కుడి వైపున కూర్చొన్న ఆమె తన కుడిచేతిని కిటికీ నుంచి బయటకు పెట్టింది. విషయాన్ని గమనించిన డ్రైవర్ ఆమెను అప్రమత్తం చేయడం మరిచాడు. అప్పటికే పెద్దవడుగూరు మండలం వీరేపల్లి వద్దకు చేరుకున్న బస్సుకు అతి సమీపంలో తాడిపత్రి నుంచి గుత్తి వైపుగా వెళుతున్న లారీ దూసుకెళ్లింది. ఘటనలో సుధ కుడి చెయ్యి తెగి రోడ్డు పక్కన పడింది. ప్రయాణికులు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వంచకుడిపై కేసు నమోదు

ఉరవకొండ: దివ్యాంగురాలిని ప్రేమ పేరుతో నమ్మించి రూ.లక్షలు దోచుకున్న వంచకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హరినాథ్ తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన ఓ దివ్యాంగురాలితో పరిచయం పెంచుకున్న నెరిమెట్ల గ్రామానికి చెందిన వీరారెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి... తొమ్మిదేళ్లుగా ఆమెను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. భవిష్యత్తు అవసరాల కోసం ఆమె దాచుకున్న రూ.10 లక్షలను తన సొంతానికి వాడుకున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన ఆమె ఈ నెల 1న ఎస్పీ కె.శ్రీనివాసరావును కలసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అనంతరం గురువారం ఉరవకొండ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో రూ.7 లక్షలు మాయం

గుత్తి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బ్యాగ్‌లో నుంచి రూ. లక్షలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంటూరు జిల్లా నరసాపురం పట్టణానికి చెందిన శ్రీనివాసరావు తన వ్యాపార నిమిత్తం స్నేహితులతో కలసి బుధవారం రాత్రి గుంటూరు నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురానికి బయలుదేరాడు. గుత్తి దాటిన తర్వాత తన బ్యాగ్‌ను పరిశీలించుకున్న ఆయన అందులో ఉంచిన రూ.7 లక్షలు కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. పలువురిని ఆరా తీసిన అనంతరం చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం ఉదయం గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్బీకేలో ఐరన్ చోరీ

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద నిల్వ ఉంచిన ఐరన్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. నాలుగు రోజులు ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు గురువారం సాయంత్రం పెనుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్ పేర్కొన్నారు.

తపాలా పాలసీల పునరుద్ధరణకు అవకాశం

అనంతపురం సిటీ: కాలపరిమితి ముగిసిన పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పాలసీల పునరుద్ధరణకు అవకాశం కల్పిస్తూ తపాలా శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ప్రీమియం చెల్లింపుపై జూన్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ మధ్య కాలంలో డిఫాల్ట్, ఆలస్య రుసుముపై మినహాయింపు వర్తిస్తుంది. రూ.లక్ష వరకు 25 శాతం(రూ.2,500), రూ.1,00,001 నుంచి రూ.3 లక్షల వరకు 25 శాతం(రూ.3 వేలు), రూ.3,00,001 నుంచి అంతకంటే ఎక్కువ మొత్తంలో పాలసీ ఉంటే 30 శాతం(రూ.3,500) ఆలస్య రుసుములో రాయితీ/మాఫీ పరిమితం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ మొత్తానికి సంబంధించి జీఎస్టీ మినహాయింపు ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్హులైన పాలసీదారులకు తపాలా శాఖ అధికారులు పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి

అనంతపురం: జార్ఖండ్‌లోని రాంచీ వేదికగా ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అనంతపురం క్రీడాకారులు 9 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన లావిష్ రెడ్డి, ధన్విత్, లెహత్‌సాయి, హంజా హుస్సేన్, కార్తీక్‌ను గురువారం జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ రోలింగ్ స్కేటింగ్ అకాడమీ కోచ్‌లు పి.నాగేంద్ర, ఆంజినేయులు, అనిల్‌కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


రొద్దం: ద్విచక్ర వాహనంపై నుంచి అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన వెంకటేష్, ఈశ్వరమ్మ (47) దంపతులు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి బయలుదేరారు. మార్గమధ్యంలో గౌరాజుపల్లి వద్ద కోళ్ల ఫాం వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా ఓ పాము వచ్చింది. గమనించిన వెంకటేష్ డ్రైవింగ్‌లో నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఈశ్వరమ్మ కింద పడింది. ఘటనలో తలకు బలమైన గాయమైన ఆమెను స్థానికులు వెంటనే రొద్దం పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ నాగస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విజిలెన్స్ సీఐ రామారావు, ఎఫ్ఆర్ఓ యామినీసరస్వతి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భోగన్‌గౌడ్ తదితరులు గురువారం ఉదయం గోవిందవాడ క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ లారీని ఆపి తనిఖీ చేయగా 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న కర్ణాటకలోని బళ్లారికి చెందిన బసవరాజు, నవీన్, యువరాజు, వాహన డ్రైవర్ అయ్యప్పస్వామిపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955 సెక్షన్ 6(ఏ) కింద కేసు నమోదు చేశారు.

బిందు సేద్యంతో లాభాలు


బిందు సేద్యం పరికరాల ఆవశ్యకతను వివరిస్తున్న పీడీ ఫిరోజ్‌ఖాన్

కుందుర్పి: బిందు సేద్యంతో లాభాలు పుష్కలంగా ఉంటాయని రైతులకు ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. కుందుర్పి మండలం అప్పిలేపల్లిలో బిందుసేద్యంతో రైతులు చేపట్టిన పండ్ల తోటల సాగును గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం బిందు, తుంపర సేద్యం పరికరాల వినియోగం వల్ల కలిగే లాభాలపై రైతులను చైతన్య పరిచారు. రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను ప్రభుత్వం అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 12వేల హెక్టార్లకు సంబంధించి చిన్న సన్నకారు రైతులతో పాటు 10 ఎకరాలున్న రైతులకు సైతం పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యంపై ఆసక్తి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, మండల రైతు సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, ఎస్టీఓ ఓబుళపతి, రైతులు హనుమంతరాయుడు, రామాంజినేయులు, మహేష్, మారెక్క, జంగమ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.